రాచబాట



గాండ్లపెంట మండలంలో కొత్తగా నిర్మించిన సాదులవాండ్లపల్లి రోడ్డు

ఇన్నాళ్లూ నల్లచెరువు మండలం నడింపల్లి, సుబ్బరాయునిపల్లి, నల్ల జోడు వారిపల్లి గ్రామాల పేరు చెప్పగానే 'అమ్మో.. ఆ ఊళ్లకు కాలిబాట కూడా సక్రమంగా లేదు' అనే వారు. ప్రాణాపాయ స్థితిలో ఎవరైనా 108కు ఫోన్ చేసినా 'క్షమించండి. మీ ఊరికి రోడ్డు లేదు. 108 వాహనం రాదు' అని నిర్మొహమాటంగా చెప్పేవారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ తరఫున కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆయా గ్రామాలకు ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు 'మీరు మాకు ఏం సాయం చేయకపోయినా పర్వాలేదు. మా ఊరికి రోడ్డు వేయించండి చాలు' అని ప్రజలు కోరారు. 'నేను గెలిస్తే కచ్చితంగా మీ ఊరికి రోడ్డు వేయిస్తాను. అలా వేయించక పోతే ఇంకెప్పుడూ మీ ఊరికి ఓటు అడిగేందుకు రాను' అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించారు.

- ఇచ్చిన హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి
- రూ.843 కోట్లతో రహదారుల నిర్మాణం
- గ్రామాల ముఖచిత్రాన్నే మార్చేసిన రహదారులు

కదిరి: రహదారులు నాగరికతకు చిహ్నాలు. శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి నియోజకవర్గం 1952లో ఏర్పడింది. ఇక్కడి నుంచి ఒకరిద్దరు మంత్రులయ్యారు. శాసనసభ స్పీకర్లు అయ్యారు. ఎంతోమంది ఎంపీలు అయ్యారు. మరెంతో మంది ఎమ్మెల్యేలుగా గెలుపొందినా నియోజకవర్గంలో 300కు పైగా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదంటే ఆశ్చర్యం వేస్తుంది. రోడ్డు లేక ఇక్కడి గ్రామీణ ప్రజలు అవస్థలు పడ్డారు. అయితే ఇప్పుడు నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా అందమైన రోడ్లు ఆహ్వానం పలుకుతున్నాయి. కొత్తగా వేసిన రోడ్లతో ఎన్నో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. కదిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో మొత్తం 735 గ్రామాలు ఉన్నాయి. గతంలో మండల కేంద్రాలతో పాటు కొన్ని గ్రామాలకు మాత్రమే రోడ్డు సౌకర్యం ఉండేది. 2019 ఎన్నికల సమయంలో తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని 335 గ్రామాల వాసులు అప్పట్లో ప్రస్తుత ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి దృష్టికి తెచ్చారు. అప్పట్లో ప్రజలకిచ్చిన హామీ మేరకు రూ.843.41 కోట్లు వెచ్చించి ఈ నాలుగేళ్లలో 325 గ్రామాలకు కొత్తగా రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇక రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు కేవలం 10 మాత్రమే ఉన్నాయి. అంటే దాదాపు 98 శాతం పూర్తి చేశారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధి

నియోజకవర్గంలోని కదిరి మండలం ఎగువపల్లి, బూరుగుపల్లి, అబ్బావాండ్లపల్లి, గాండ్లపెంట మండలం నీరుకుంట్లపల్లి ఇలా కొన్ని గ్రామాలు టీడీపీకి కంచుకోటలుగా ఉండేవి. కానీ ఈ గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా ఉండేది కాదు. టీడీపీ హయాంలో రోడ్లు వేయాలనే ఆలోచన కూడా ఆ పార్టీ ప్రజా ప్రతినిధులకు రాలేదు. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇక్కడ సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా పరుగులు పెడుతోంది. గాండ్లపెంట మండలంలో 12, తలుపుల మండలంలో 19, కదిరి మండలంలో 15, ఎన్‌పీకుంట మండలంలో 20, నల్లచెరువు మండలంలో 9, తనకల్లు మండలంలో 26 ఇలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా 101 గ్రామీణ రహదారుల పనులు దిగ్విజయంగా పూర్తి చేసింది. 300లకు పైగా గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడింది.

కదిరి నియోజకవర్గంలో కొత్తగా నిర్మించిన రోడ్ల వివరాలు

మొత్తం గ్రామాలు	735
కొత్తగా రోడ్లు వేసిన గ్రామాలు	325
ఇంకా రోడ్లు వేయాల్సిన గ్రామాలు	10
నిర్మించిన రోడ్ల సంఖ్య	101
ఖర్చు చేసిన నిధులు	రూ.843 కోట్లు

రహదారులతో మహర్దశ

నియోజకవర్గ పరిధిలో చేపట్టిన ప్రధాన రహదారులతో కదిరికి మహర్దశ రానుంది. రూ.209 కోట్లతో కదిరికి బైపాస్ రోడ్డు నిర్మాణం, ముద్దనూరు నుంచి కొడికొండ వరకూ నిర్మిస్తున్న ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణానికి రూ.217 కోట్లు వెచ్చిస్తున్నారు. అలాగే బెంగళూరు నుంచి నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా కదిరి నియోజకవర్గం మీదుగానే వెళుతోంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.200 కోట్లు ఖర్చు చేస్తోంది. అదే విధంగా రాయచోటి-కదిరి డబుల్‌లైన్ రోడ్డుకు రూ.38.74 కోట్లు, బత్రేపల్లి నుంచి ఎన్‌పీకుంట వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.22.5 కోట్లతో పాటు కొన్ని రోడ్ల మరమ్మతుల కోసం రహదారులు, భవనాల శాఖ కదిరి నియోజకవర్గంలో మరో రూ.38 కోట్లు ఖర్చు చేస్తోంది.

మా ఊరికి రోడ్డు వేశారు..



మా ఊరికి రోడ్డు వేయాలని ఎంతోమంది నాయకులను వేడుకున్నాం. ఎవ్వరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి సార్ పుణ్యమా అని మా ఊరికి రోడ్డు వచ్చింది. చుట్టుపక్కల పల్లెలన్నింటికీ ఈ రోడ్డు ఎంతో ఉపయోగంగా ఉంది. అందుకే ఎవరినోట విన్నా..' జై జగన్.. జైజై సిద్దారెడ్డి' అంటున్నారు.

– బుక్యా కళావతమ్మ, తుమ్మలబైలు పెద్దతండా, గాండ్లపెంట మండలం

ప్రజాసేవతో సంతృప్తి



ఎన్నికల సమయంలో నేను ప్రచారానికి వెళ్లినప్పుడు ఎంతోమంది 'మా ఊరికి రోడ్డు వేయించండి..అని అడిగారు. అప్పట్లో వారికి ఇచ్చిన మాట ప్రకారం 300కు పైగా గ్రామాలకు రోడ్లు వేయించాను. ఇంకా కేవలం 10 గ్రామాలు మిగిలాయి. వాటిని కూడా పూర్తి చేసి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా. ప్రజా సేవ చేయడంలోనే నాకు సంతృప్తి లభిస్తుంది.

– ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

క్లుప్తంగా

పక్కాగా ఉపాధి పనుల తనిఖీ



మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌పీ కాంతయ్య

తాడిమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై 17వ విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఏపీఓ సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధిహామీ సాంకేతిక, క్షేత్ర సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పీ, డీఆర్పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌పీ కాంతయ్య మాట్లాడుతూ.. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లోని 30 గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 మధ్యకాలంలో జరిగిన ఉపాధిహామీ పథకం పనులు, ఉపాధిహామీ పథకం అనుసంధానం జరిగిన పనులను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో డీర్పీలు, గ్రామ తనిఖీ సహాయకులు 15 రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తూ గ్రామసభలు న్విహిస్తారన్నారు. చివరగా ఎంపీడీఓ కార్యాలయంలో బహిరంగ వేదిక (ఓపెన్ ఫోరమ్) నిర్వహించి సామాజిక తనిఖీల్లో నమోదు చేసుకున్న అంశాలను వెల్లడించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈసీ అశోక్ కుమార్‌రెడ్డి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి



మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి

తాడిమర్రి: వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు సమన్వయంతో పని చేసి, అర్హులకు పథకాలు అందించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని ఎం.అగ్రహారం, తాడిమర్రి, పిన్నదరి, నార్సింపల్లి సచివాలయాలను శుక్రవారం డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్‌రెడ్డితో కలసి సందర్శించారు. మీ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల అమలులో సమస్యలు ఉంటే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రోజామణి, వెంకటనారాయణరెడ్డి, ఆదెప్ప, నారాయణ స్వామి, పుల్లయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు పొరాళ్ల విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జొల్లిరెడ్డి అశ్వర్థ, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, నాయకులు బడారు పెద్దఓబిలేసు, వైస్ ఎంపీపీ బీసాని లింగమ్మ, మదమంచి మల్లికార్జున నాయుడు, సల్లాపురం బాలరమణారెడ్డి, శుట్టిపల్లి ఆనందరెడ్డి పాల్గొన్నారు.

పదోన్నతులు త్వరగా పూర్తి చేయాలి



జేడీ పద్మమ్మను కలసిన సెరికల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమిరెడ్డి అంజన్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సెరికల్చర్ ఉద్యోగుల పదోన్నతులు త్వరగా పూర్తి చేయాలని సెరికల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమిరెడ్డి అంజన్‌రెడ్డి కోరారు. శుక్రవారం పుట్టపర్తికి విచ్చేసిన ఆయన జేడీ పద్మమ్మను కలసి, వినతిపత్రం అందజేశారు. పదోన్నతుల లిస్టను త్వరగా తేల్చాలని కోరగా జేడీ సానుకూలంగా స్పందించారు. పట్టు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను అందించాలని కోరారు. పట్టు సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న టిప్పర్



బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని గంటాపురం క్రాస్ వద్ద శుక్రవారం టోయింగ్ వ్యాన్‌ను టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మరమ్మత్తుకు వచ్చిన ఓ కారును కదిరి నుంచి అనంతపురానికి టోయింగ్ వ్యానుకు కట్టుకొని తీసుకెళ్తున్నారు. ఇదే సమయంలో అనంతపురం వైపు నుంచి ముదిగుబ్బకు తారుతో వెలుతున్న నితిన్‌సాయి కంపెనీకి చెందిన టిప్పర్ టైరు పగలడంతో టోయింగ్ వ్యానును గంటాపురం క్రాస్ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో టోయింగ్ వ్యాను డ్రైవర్ షబ్బీర్ (అనంతపురం పట్టణానికి చెందిన వ్యక్తి) వ్యానులో ఇరుక్కుపోయాడు. ఏఎస్‌ఐ సోమశేఖర్ మూర్తి, కానిస్టేబుల్ నాయుడు, పోలీసులు సహకారంతో అతడ్ని బయటకు తీసి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో టోయింగ్ వ్యాన్‌తో పాటు కారు కూడా దెబ్బతింది. టోయింగ్ వ్యాను డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగనన్న కాలనీ పరిశీలన

కదిరి అర్బన్: మండల పరిధిలోని గంగన్నగారిపల్లి వద్ద ఏర్పాటు చేసిన జగనన్న కాలనీని తహసీల్దార్ సునీత శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పేదలందరికీ సొంత ఇళ్లు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ మున్వర్‌బాషా, కుమ్మరవాండ్ల పల్లి సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



క్రీడాదుస్తులను అందజేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: చిత్తూరు జిల్లా నగరిలో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సర్పంచ్ బండి సరస్వతి క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి అనంతపురం జిల్లా బాలికల జూనియర్స్ బాల్ బాడ్మింటన్ కోచింగ్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో పాటు చదువులోనూ రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కోచింగ్ క్యాంపు నిర్వహణకు సర్పంచు దంపతులు బండి సరస్వతి, బండి వీరనారప్ప రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టుకు 15 జతల క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరాముడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీడీ లక్ష్మీనారాయణ, నాయకులు నారాయణ స్వామి, సచివాలయ కన్వీనర్ పెదయ్య, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, బాల్ బాడ్మింటన్ జిల్లా ప్రతినిధులు బాబాఫక్రుద్దీన్, విజయ్‌కుమార్, నారాయణ స్వామి, కోచ్ ధనుంజయ, ఉపాధ్యాయులు రవీంద్ర, గంగిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఓబుల రెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాన్ని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ సుమియా, మండల అగ్రి బోర్డు చైర్మన్ చెన్నకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలు అందించేందుకు 2 వేల జనాభాకు ఒకటి చొప్పున వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్కడే వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. 7 రకాల రక్త పరీక్షలు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం స్థల దాత విశ్వనాథరెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు (కిష్టారెడ్డి)ని సన్మానించారు.

పరామర్శ..

ఓబులరెడ్డిపల్లిలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న జాఫర్‌సాబ్ కుమారుడు బాషాను ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫీనాయక్, మాజీ సర్పంచులు సూర్యనారాయణ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కృష్ణారెడ్డి, తహసీల్దార్ కే.శ్రీధర్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, వైద్యాధికారులు మున్వర్‌బాషా, సల్మా, సర్పంచులు శ్రీరామ్‌రెడ్డి, దివాన్‌వలి, పెద్దినాయుడు, వెంకటనారాయణ, పురుషోత్తంరెడ్డి, శ్రీరాములు, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మసకవంకపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని మూలప్పగారిపల్లి, మసకవంకపల్లి గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు విన్నవించిన పలు సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్దపీట వేశారన్నారు. నవరత్నాల్లోని పథకాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నిరాటంకంగా అమలు చేశారని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ పేరుతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

హామీలన్నీ నెరవేర్చాం..

పాదయాత్రలో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ సీఎం వైఎస్ జగన్ దాదాపు నెరవేర్చారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గుర్తు చేశారు. అలాగే ఇవ్వని మరెన్నో హామీలను కూడా నెరవేర్చడం జరిగిందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఇంకా ఎవరికైనా ఇల్లు మంజూరు కాకుండా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు దరఖాస్తు వారందరికీ ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

మూలప్పగారిపల్లిలో ఎం.ఆదెప్ప, ఎం.రమణప్ప, బీ.వెంకట్రమణప్ప, మసకవంకపల్లిలో కుంచెపు ఉత్తప్ప, చంద్ర వారి కుటుంబ సభ్యులు టీడీపీని వీడి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.అరుణమ్మ, మాజీ సర్పంచ్ ఎస్.రాంమోహన్‌రెడ్డి, మాజీ రెస్కో చైర్మన్ ఎస్.గంగిరెడ్డి, జెడ్పీటీసీ ఎస్. రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, నాయకులు విశ్వనాథరెడ్డి, సూర్యనారాయణ, సుధాకర్, రామలింగం, జరిపిటి రవీంద్ర, నారాయణ స్వామి, శీనప్ప, లోకేష్, రమణప్ప పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంతో లాభాలు



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్: లాభదాయకమైన గొర్రెల పెంపకాన్ని చేపట్టాలని ప్యాపిలి గొర్రెల పెంపకం దారుల శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్, మాస్టర్ ట్రైనర్ ఎం.శ్రీనివాసులరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.వీరభద్రయ్య ఆధ్వర్యంలో గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా డీఏహెచ్‌ఓ శుభదాసు, ధర్మవరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం ఉప సంచాలకులు డాక్టర్ పి.శాంతయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేలు ఉండేలా చూసుకోవాలన్నారు. అంటు వ్యాధులు బారిన పడిన జీవాలను మంద నుంచి వేరుచేసి చికిత్స అందించడం ద్వారా గొర్రెల మరణాల శాతం తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శేఖర్, గొర్రెల పెంపకందారులు, పశు వైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

నల్లచెరువు: మండల పరిధిలోని కె.పూలకుంట గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి శుక్రవారం విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కె.పూలకుంటకు చెందిన ఎం.కిష్టప్ప అనే రైతు తమ పొలం వద్ద నున్న బోరుబావికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో కుమారుడు నాగరాజుకు సమాచారం అందించాడు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఎక్స్ ఫీజ్ లేకపోవడం గమనించిన నాగరాజు కరెంట్ పోల్ పైకి ఎక్కి ఫీజ్ వేసేందుకు ప్రయత్నించాడు. విద్యుదాఘాతానికి గురై కరెంట్ పోల్ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడ్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుల మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఏరియా ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా వెంకటేష్

కదిరి టౌన్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నూతన రాష్ట్ర కార్యదర్శి, కడప జిల్లా ఇన్‌చార్జ్‌గా జి.వెంకటేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు రంగలి గోపి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి సేవలు అమూల్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: పట్టణంలోని జడ్జ్ బంగ్లా ఎదురుగా ఉన్న రెడ్డి కమ్యూనిటీ భవనంలో శుక్రవారం నల్లమాడ మండలం పుల్లగూరపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది ఎ.చంద్రశేఖర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి కార్యక్రమంలో పాల్గొని, చంద్రశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి న్యాయవాద వృత్తిని ఎంచుకొని సేవలందించారన్నారు. న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకొని మన్ననలు పొందారన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటి సభ్యులు, న్యాయవాదులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కొత్తచెరువు: మండల పరిధిలోని మీర్జాపురంలో శనివారం ఉదయం 07:30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బారాన్ సాహెబ్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నేడు భూమిపూజ

కదిరి అర్బన్: మండల పరిధిలోని పందులకుంట గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి భూమిపూజ చేస్తారని పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్ శుక్రవారం పేర్కొన్నారు.

షాపులకు సీల్డు టెండర్ల ఆహ్వానం

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లో ఎల్‌ఐసీ ఆఫీసుకు వెళ్లే దారిలో ఉన్న 3 షాపులకు సీల్డు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎం మైనుద్దీన్ శుక్రవారం తెలిపారు. అలాగే తనకల్లు మండల కేంద్రంలోని బస్టాండ్‌లో వెల్డింగ్ షాపు, హోటల్ వ్యాపారానికి సీల్డు టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. టెండర్లలో పాల్గొనే వారు రూ.885 చెల్లించి టెండర్ ఫారంను డిపో మేనేజర్ కార్యాలయంలో ఈనెల 25వ తేదీలోపు కొనుగోలు చేయాలన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలను 26వ తేదీన పుట్టపర్తిలోని ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల్లోపు దాఖలు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 08494224315 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

రుణాలు మంజూరు చేయాలని వినతి

ధర్మవరం: కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ కోరారు. పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు వచ్చినా బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదన్నారు. కౌలు రైతులకు ఎలాంటి గ్యారెంటీ లేకుండా రూ.1.60 లక్షల వరకూ పంట రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు శ్రీరాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కదిరి టౌన్: స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు తెలిపారు. శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో తయారుచేసిన ఉత్పత్తులను మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రదర్శించారు. స్టాల్‌ను పరిశీలించిన కమిషనర్.. మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎంసీ శ్రీనివాస రెడ్డి, గిరి, తౌసిఫ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామగిరి: గరిమేకలపల్లికి చెందిన అశోక్‌కుమార్ (20) రెండురోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కత్రా హనుమంత రెడ్డి, మండల అగ్రిబోర్డ్ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్ సిద్ధన్న, నర్సిరెడ్డి తదితరులు మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు కుటుంబానికి రూ.20 వేల సాయం అందించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే ప్రభుత్వ లక్ష్యం

చెన్నేకొత్తపల్లి: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కనుముక్కలలో ఎంపీడీఓ గంగావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య శిబిరంలో ఎన్‌ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యులు ఉదయ్ ఆధ్వర్యంలో 540 మంది రోగులకు వైద్య సేవలను అందించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ రమాదేవి, ఈఓఆర్డీ అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: బూరుగుపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డా.ప్రమీల, వినోద్‌కుమార్, ధర్మతేజ, బాబాఫక్రుద్దీన్ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, ఉపసర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ కుమారి, ఎంపీడీఓ అంజనప్ప, ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి పాల్గొన్నారు.



తలుపులలో అష్టలక్ష్మిగా వాసవీ మాత



ధర్మవరం: అలంకరణలో దుర్గమ్మ దేవత



నల్లచెరువులో సరస్వతీ దేవిగా వాసవీ మాత



పుట్టపర్తిలో సరస్వతీ దేవిగా సత్యమ్మ దేవత

కరుణించు.. సరస్వతీ మాత

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో దసరా సందడి నెలకొంది. శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ఆరవ రోజు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవార్లు సరస్వతీ దేవి, మహాలక్ష్మి, అష్టలక్ష్మి తదితర రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివెళ్లి అమ్మవార్లకు పూజలు చేపట్టారు. పలుచోట్ల భజన బృందాలతో భజనలు చేయించారు. బత్తలపల్లిలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షినెట్‌వర్క్:

